సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



టన్ను చీనీ రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 707 టన్నుల కాయలు వచ్చాయి.



కిలో టమాట రూ.16
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ. 6, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.36	సెహరీ : 4.55



న్యూస్‌రీల్

ఉగాది అందరి జీవితాల్లో ఉషస్సులు నింపాలి


అరుణ్‌బాబు, కలెక్టర్


మాధవరెడ్డి, ఎస్పీ

పుట్టపర్తి అర్బన్/ పుట్టపర్తి టౌన్: క్రోధి నామసంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, ఈ ఉగాది అందరి జీవితాల్లో ఉషస్సులు నింపాలని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి ఆకాంక్షించారు. క్రోధి నామ సంవత్సర తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు, పోలీస్, జిల్లా యంత్రాంగానికి వేర్వేరు ప్రకటనల్లో వారు శుభాకాంక్షలు తెలిపారు. అందరూ కొత్త ఆలోచనలతో ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టాలని పిలుపునిచ్చారు. రానున్న సంవత్సరం ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, పంటలు బాగా పండి రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

నీటి ఎద్దడి నివారణకు నిధులివ్వండి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ వినతి


సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో తాగునీటి సరఫరాకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని కోరారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా తదితర పరిస్థితులపై సమీక్షించారు. వీసీలో కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు సుమారు రూ.5.54 కోట్లు అవసరమవుతాయని, వెంటనే నిధులను విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలోని 179 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నామన్నారు. చేతి పంపులు, బోర్లు మరమ్మత్తులకు నిధుల కొరత లేదన్నారు. అలాగే జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపడుతున్నామని వెల్లడించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 11 గంటల్లోపు ఉపాధి హామీ పనులు ముగించేలా చర్యలు తీసుకున్నామని సీఎస్‌కు తెలిపారు.

టీచర్లంతా శిక్షణ తరగతులకు హాజరు కావాలి

కొత్తచెరువు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 10న ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించనున్న శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులంతా హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల విధులకు ఎంపిక చేసిన ఉపాధ్యాయులంతా శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. పదో తరగతి 'స్పాట్'కు హాజరైన వారు, స్పాట్ ఆర్డర్ వచ్చి మినహాయింపు పొందిన ఉపాధ్యాయులు కూడా తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరు కావల్సిందేనన్నారు. ఎవరైనా శిక్షణ తరగతులకు గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఊరంతా ఉగాది సందడి


కొత్తచెరువులో కళకళలాడుతున్న మార్కెట్


పుట్టపర్తి పట్టణంలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పుట్టపర్తి టౌన్: తెలుగు సంవత్సరాది ఉగాదిని ఘనంగా జరుపుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. క్రోధి నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికేందుకు లోగిళ్లను ముస్తాబు చేశారు. మామిడిపూత, పూల కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. అలాగే నూతన దుస్తుల కొనుగోళ్లకు జనం ఉత్సాహం చూపగా వస్త్ర దుకాణాలన్నీ కళకళలాడాయి. ఫుట్‌పాత్‌లపై కూడా వ్యాపారాలు భారీగా జరిగాయి. ఊరూరా పంచాంగ శ్రవణాల కోసం ఏర్పాట్లు చేశారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ పుట్టపర్తిలో స్థిరపడిన విదేశీయులు సైతం ఉగాది జరుపుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

శిల్పారామంలో వేడుకలు..
ఉగాదిని పురస్కరించుకొని ఎనుములపల్లి సమీపంలోని శిల్పారామంలో మంగళవారం సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పాలనాధికారి రమేష్ రెడ్డి తెలిపారు. పంచాంగ శ్రవణం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నేడు కలెక్టరేట్‌లో సంబరాలు
పుట్టపర్తి అర్బన్: ఉగాది సందర్భంగా మంగళవారం ఉదయం 7.30 గంటలకు కలెక్టరేట్‌లో సంబరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఈ మేరకు స్పందన సమావేశ మందిరంలో ఏర్పాట్లు చేశామన్నారు.


పండుగ సామగ్రి కొనుగోళ్లతో కిటకిటలాడుతున్న హిందూపురం మార్కెట్

డబ్బు పట్టి.. రాజకీయ సమాధి కట్టి

చంద్రబాబా.. మజాకా
- హనుమంతరాయ చౌదరి రాజకీయ ప్రస్థానానికి ఫుల్‌స్టాప్
- అంతా నాదే అనుకున్న వైకుంఠంకు చరమగీతం
- బాబు రాజకీయ క్రీడలో జితేందర్‌గౌడ్ పరాజయం
- బీసీ నేత నిమ్మలకు నమ్మక ద్రోహం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: చంద్రబాబు రాజకీయ క్రీడలో బలైన నేతలు ఎందరో ఉన్నారు. ఆయన చరిత్ర చూస్తే ఎవరికైనా ఈ విషయం ఇట్టే అర్థమైపోతుంది. నమ్ముకున్న వారిని నట్టేట ముంచడం.. జెండా మోసిన వారిని కాదని డబ్బున్న వారికి టికెట్లు ఇవ్వడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. గతంలో ప్రతి ఎన్నికల సమయంలో తన స్వార్థ బుద్ధిని చాటుకున్న ఆయన.. ఈ ఎన్నికల్లోనూ తన నైజాన్ని చాటారు. జిల్లాకు చెందిన సీనియర్లకు శఠగోపం పెట్టారు. గత ఐదేళ్లూ వాడుకుని అర్థంతరంగా తమను బలిపీఠం ఎక్కించడంతో వారంతా నైరాశ్యంలో మునిగిపోయారు. చివరి నిమిషం వరకూ టికెట్ ఆశచూపి ఆఖరున రూ.కోట్లకు పడగలెత్తిన వారికి పెద్దపీట వేయడంతో నాయకులు ఒక్కసారిగా కుదేలై పోయారు. బాబును నమ్ముకుంటే ఎవరికైనా ఇదే గతి పడుతుందని వాపోతున్నారు.

ఏళ్ల తరబడి పనిచేసినా ఫలితమేది?
కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఉన్నం హనుమంతరాయ చౌదరి రెండున్నర దశాబ్దాలుగా పార్టీకి కష్టపడి పనిచేశారు. గడిచిన రెండున్నరేళ్లుగా ఆయన కుమారుడు నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేసినా ఆయన్ను దూరం పెట్టి కాంట్రాక్టర్ అమిలినేనికి సీటు ఇవ్వడంతో ఉన్నం రాజకీయ నిరుద్యోగి అయ్యారు. మరో నేత ఉమామహేశ్వరనాయుడుకూ మొండి చేయి చూపడంతో ఆయన చంద్రబాబును నమ్ముకోవడం సరికాదని, ఇక్కడ భవిష్యత్తు లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

జితేందర్ గౌడ్‌కూ మొండిచేయి
గుంతకల్లు నియోజకవర్గంలో గుమ్మనూరు జయరామ్‌కు టికెట్ ఇవ్వడం జిల్లా మొత్తం బాబు నైజాన్ని చాటింది. మొన్నటివరకూ తిట్టిపోసిన గుమ్మనూరుకు టికెట్ ఇచ్చారు. దీంతో బాబు ఎంతటి మోసానికైనా సమర్థుడే అంటూ మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాబు రాజకీయ క్రీడలో జితేందర్‌గౌడ్ పరాజయం పాలయ్యారని నియోజకవర్గం ప్రజలు భావిస్తున్నారు. గుమ్మనూరు చేరిక జిల్లా వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేక ప్రభావం చూపిస్తోందని టీడీపీ కేడర్ భావిస్తోంది.

వైకుంఠం శకం ముగిసినట్టే
రెండు దశాబ్దాలుగా టీడీపీలో కీలకంగా వ్యవహరించిన అనంతపురం అర్బన్ నియోజకవర్గ నేత ప్రభాకర్ చౌదరికి రాజకీయ సన్యాసం తప్పదని భావిస్తున్నారు. పార్టీ అంతా నాదే అని భావించే ఆయనకు మొండిచేయి చూపి దగ్గుబాటి ప్రసాద్‌కు టికెట్ ఇచ్చారు. ప్రసాద్ రాక వెనుక భారీగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు చర్చ జరుగుతోంది. దీంతో ప్రభాకర్ చౌదరి రాజకీయ శకం ముగిసినట్టేనని, చేసేదేమీ లేదని ఆయన వర్గం భావిస్తోంది.

నిమ్మలకు నమ్మక ద్రోహం
ఓట్లకోసం కులం కావాలి.. డబ్బు కోసం కొత్త నేతలు కావాలి.. ఇదీ చంద్రబాబు తీరు. బీసీ వర్గానికి చెందిన నిమ్మల కిష్టప్ప పట్ల చంద్రబాబు వ్యవహరించిన తీరును చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. గతంలో రెండు దఫాలు నిమ్మల ఎంపీగా చేశారు. అలాంటి వ్యక్తికి ఈ సారికి టికెట్ ఇవ్వలేదు. దీంతో చేనేత వర్గానికి చెందిన ఆయన తీవ్ర ఆవేదనలో ఉన్నారు. ఇక రాజకీయ శకం ముగిసినట్టేనని తెలుస్తోంది. చంద్రబాబుపై ఆయన కత్తులు నూరుతున్నారు.

త్రుటిలో తప్పించుకున్న ఆ ఇద్దరు..
మరో ఇద్దరు సీనియర్ నేతలు బాబు వెన్నుపోటునుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ఆ ఇద్దరే బీకే పార్థసారథి, పల్లె రఘునాథరెడ్డి. చివరి వరకూ ఇద్దరికీ టికెట్లు లేవు. చివరన ఇక తప్పని స్థితిలో బీకే పార్థసారథికి హిందూపురం ఎంపీ సీటు ఇవ్వగా.. పల్లె రఘునాథరెడ్డి కోడలికి పుట్టపర్తి టికెట్ ఇచ్చారు. అయితే, ఈ ఇద్దరూ చావుతప్పి కన్ను లొట్టపోయిన చందంగా చంద్రబాబు వలలో నుంచి బయటపడ్డారని పార్టీలోని నాయకులే అంటుండడం గమనార్హం.

ఊపిరి ఉన్నంత వరకూ వైఎస్సార్‌సీపీలోనే

- జగనన్న ఆశీస్సులతోనే రాజకీయాల్లోకి..
- 'పురం' మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ


హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: ''జగనన్న అవకాశం ఇవ్వడం వల్లే రాజకీయాల్లోకి వచ్చా. ఆయన ఆశీస్సులతోనే మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేస్తున్నా. నా ఎదుగుదలకు అవకాశం ఇచ్చిన జగనన్న బాటలోనే నడుస్తా. ఊపిరి ఉన్నంత వరకూ వైఎస్సార్‌సీపీలోనే ఉంటా' అని హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. సోమవారం ఆమె తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నానంటూ వచ్చిన వార్తలన్నీ అవాస్తవాలన్నారు. ఇలాంటి అసత్యాలను ప్రజలు, పార్టీ అభిమానులు ఎవరూ నమ్మవద్దన్నారు. జగనన్న ప్రభుత్వంలోనే మహిళలకు సముచిత స్థానం, గౌరవం దక్కుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి తనకు ఇంత పెద్ద పదవి ఇచ్చారని, ఆయనకు ఎప్పటికీ కృతజ్ఞతగా, రుణపడి ఉంటానన్నారు. వైఎస్సార్ సీపీకి సేవ చేస్తూ తనకిచ్చిన బాధ్యతను నెరవేరుస్తూ ముందుకు సాగుతానన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం


హిందూపురంలో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ, పోలీస్ బలగాలు

- ఎస్పీ మాధవరెడ్డి
- 'పురం'లో కేంద్ర బలగాలతో కవాతు

హిందూపురం అర్బన్: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా, ప్రజల్లో ధైర్యం నింపేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ కంజాక్షన్ నేతృత్వంలో హిందూపురం సబ్ డివిజన్ పోలీసులు, కేంద్ర పారా కంపెనీల బలగాలు సోమవారం సాయంత్రం పట్టణంలోని హస్నాబాద్ నుంచి బాలాజీ సర్కిల్, రహమత్‌పూర్ వరకు కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పిస్తామని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ప్రశాంత ఎన్నికలకు రాజకీయ పార్టీలూ సహకరించాలని కోరారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచామని, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ డీఎస్పీ కంజాక్షన్ అన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, వారికి రక్షణగా తాముంటామని భరోసా ఇచ్చేందుకు కవాతు నిర్వహించినట్లు వెల్లడించారు. పట్టణ సీఐలు వి. శ్రీనివాసులు, రియాజ్ అహమ్మద్, వై. శ్రీనివాసులు, పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలుతాగి రొమ్ముగుద్దొద్దు ఇక్బాల్

- జగన్‌మోహన్‌రెడ్డి పిలిచి టికెట్టు ఇచ్చారు
- రెండుసార్లు ఎమ్మెల్సీని చేశారు
- ఇంతచేస్తే నువ్విచ్చే గౌరవం ఇదేనా?
- మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉంది
- ఏపీ ఆగ్రో చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్


మాట్లాడుతున్న నవీన్‌నిశ్చల్, చిత్రంలో హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ తదితరులు

హిందూపురం: ''మీరు ఏనాడూ వైఎస్సార్ సీపీ జెండా మోయకపోయినా.. రాజకీయాల్లో చురుకైన పాత్ర లేకున్నా... రిటైర్డ్ ఐజీగా మీకు జగన్‌మోహన్ రెడ్డి ఎంతో గౌరవం ఇచ్చి హిందూపురం టికెట్టు ఇచ్చారు. మీరు ఓడినా ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి చట్ట సభలకు పంపారు. ఇంత చేసినా జగనన్నపై విమర్శలు చేయడం దుర్మార్గం. అమ్మపాలు తాగి రొమ్ముగుద్దొద్దు'' అని ఏపీ ఆగ్రో చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్.. ఎమ్మెల్సీ ఇక్బాల్‌పై ధ్వజమెత్తారు. సోమవారం ఆయన వైఎస్సార్ సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మతో కలిసి తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

ఒకసారి ఆత్మవిమర్శ చేసుకో..
జగన్‌మోహన్‌రెడ్డికి మైనార్టీలపై ప్రేమ లేకపోతే మహమ్మద్ ఇక్బాల్‌కు పిలిచి ఎమ్మెల్యే టిక్కెట్టు ఎలా ఇచ్చారో చెప్పాలన్నారు. ఓడినప్పుడు కూడా ధైర్యం చెప్పి రెండుసార్లు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారన్నారు. అలాంటి జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేసే ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలని ఇక్బాల్‌కు హితవు పలికారు. ముస్లిం మైనార్టీలపై వైఎస్సార్ కుటుంబానికి ఎనలేని ప్రేమ ఉందన్నారు. వైఎస్సార్ 4 శాతం రిజర్వేషన్ కల్పించి ఎందరో ముస్లిం మైనార్టీలకు మేలు చేశారని, అలాగే జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా అవకాశాలు, పదవులు ఇచ్చి అందలం ఎక్కించారన్నారు. ఆ క్రమంలోనే ఇక్బాల్‌కు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ మారడం వ్యక్తిగత విషయమని, అందుకోసం అవకాశం కల్పించిన పార్టీని విమర్శించడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు.

పార్థసారథికి మహిళలంటే అంతా అలుసా?..
టీడీపీ ఎంపీ అభ్యర్థి పార్థసారథికి మహిళలంటే ఏమాత్రమూ గౌరవం లేదని నవీన్ నిశ్చల్ అన్నారు. శనివారం టీడీపీ సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ... హిందూపురంలో మొగోళ్లు లేరని వైఎస్సార్ సీపీ ఇద్దరు ఆడవాళ్లకు టిక్కెట్లు ఇచ్చిందన్నారని, మరి పెనుకొండలో టీడీపీ మహిళకు టికెట్ ఇచ్చిందని, ఆ లెక్కన బీకే మొగోడు కాదా...? అని నవీన్ నిశ్చల్ ప్రశ్నించారు. మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించి చట్టసభల్లో సగౌరవంగా కూర్చోబెట్టాలన్నది తమ పార్టీ సిద్ధాంతమని, అందుకే తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సీట్లు కేటాయిస్తున్నారన్నారు.

జెడ్పీటీసీ శ్రీరాములు హఠాన్మరణం

- ఆత్మీయులతో మాట్లాడుతూనే మృత్యుఒడికి
- గుండెపోటుతో కన్నుమూసిన వైఎస్సార్ సీపీ నేత
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు
- అశ్రునయనాల మధ్య గుట్టూరులో అంత్యక్రియలు


నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్, రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి


పెనుకొండ ప్రభుత్వాసుపత్రిలో గుట్టూరు శ్రీరాములు మృతదేహం


గుట్టూరు శ్రీరాములు (ఫైల్)

పెనుకొండ/పెనుకొండ రూరల్: వైఎస్సార్ సీపీ నేత, పెనుకొండ జెడ్పీటీసీ సభ్యుడు గుట్టూరు శ్రీరాములు హఠాన్మరణం చెందారు. అప్పటివరకూ ఆత్మీయులతో కులాసాగా కబుర్లు చెప్పిన ఆయన.. క్షణాల వ్యవధిలోనే కూర్చున్న కుర్చీలోనే కుప్పకూలిపోయారు. స్నేహితులు హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

కూర్చున్న కుర్చీలోనే...
జెడ్పీటీసీ శ్రీరాములు సోమవారం ఉదయం 11 గంటలకు పెనుకొండలోని సాయి లాడ్జి వద్దకు వచ్చారు. సమీప బంధువు గుట్టూరు అంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల, టౌన్ కన్వీనర్లు నాగలూరు బాబు, బోయ నరసింహ తదితరులతో కులాసాగా కబుర్లు చెబుతూ ఉన్నాడు. ఉన్నట్టుండి కూర్చున్న కుర్చీలోనే వాలిపోయారు. వెంటనే ఆయన్ను మిత్రులు సమీపంలోని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీరాములును బతికించడానికి ఆస్పత్రి వైద్యులు శతవిధాలా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

ఆస్పత్రి వద్ద ఆర్తనాదాలు..
శ్రీరాములు మృతి వార్త తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు, మిత్రులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. నిర్జీవంగా ఉన్న శ్రీరాములును చూసి కన్నీటి పర్యంతమయ్యారు. బంధువుల ఆర్తనాదాలతో ఆస్పత్రి ప్రాంగణం దద్దరిల్లింది. అనంతరం శ్రీరాములు భౌతిక కాయాన్ని స్వగ్రామమైన గుట్టూరు తరలించారు.

ప్రముఖుల నివాళి..
శ్రీరాములు మృతి గురించి తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, ప్రముఖులు గుట్టూరులోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి ఉష శ్రీచరణ్, ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు చరణ్‌రెడ్డి, గంగుల భానుమతి, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర తదితరులు శ్రీరాములు పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాములు సేవలను వారు గుర్తు చేసుకున్నారు. మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ, శ్రీరాములు...దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డికి విధేయుడిగా ఉండేవారన్నారు. 2005లో పెనుకొండ నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి వైఎస్ జగన్ వెంట నడిచారని, పెనుకొండలో పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. శ్రీరాములు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు..
శ్రీరాములు మృతితో స్వగ్రామం గుట్టూరు కన్నీరుమున్నీరైంది. పార్టీలకు అతీతంగా నాయకులు తరలివచ్చి నివాళులర్పించారు. కుటుంబీకులు, బంధువులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు వెంట రాగా సాయంత్రం శ్రీరాములు అంతిమయాత్ర సాగింది. అనంతరం గ్రామ సమీపంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, కృష్ణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.1.78 లక్షలు స్వాధీనం



నగదును చూపుతున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు తీసుకెళుతున్న వ్యక్తి నుంచి రూ.1.78 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కృష్ణారావు తెలిపారు. ధర్మవరంలోని ఎర్రగుంట వై జంక్షన్ వద్ద సోమవార ఉదయం వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో అనంతపురం జిల్లా పుట్లూరు మండలం ఎ.కొండాపురానికి చెందిన పరిమి అశోక్‌నాయుడు రూ.1,78,020 తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. తరలిస్తున్న నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు వివరించారు. వాహన తనిఖీల్లో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పడమటి వీరన్న ఉత్సవాలు

- వందలాదిగా తరలివచ్చిన పన్నారపు బండ్లు



పడమటి వీరన్న స్వామి ఉత్సవాలకు వెళుతున్న పన్నారపు బండి



బత్తలపల్లి నుంచి ట్రాక్టర్‌ను ముస్తాబు చేసుకుని వెళుతున్న భక్తులు

తాడిమర్రి/బత్తలపల్లి: మూగజీవాల పట్ల కరుణ చూపే ఆరాధ్యదైవం పడమటి వీరన్న ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఉగాది పండుగను పురస్కరించుకుని ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో తొలిరోజు ఉత్సవాల్లో వందలాదిగా పన్నారపు బండ్లతో రైతు కుటుంబాలు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నాయి.

కీడు నుంచి పశువులను రక్షిస్తాడు..

తాడిమర్రి మండలం ఆత్మకూరు సమీపంలో వెలసిన పడమటి వీరన్నకు మొక్కుకుంటే పశువులకు ఎలాంటి కీడు జరగదన్నది ప్రజల విశ్వాసం. దీంతో రైతులు తమ ఆవులు, గేదెలు ప్రసవించిన మొదటి రోజున పాలను పడమటి వీరన్నకు సమర్పిస్తుంటారు. అలాగే గ్రామాలలో పోట్లాటలు, దొంగతనాలు జరిగినప్పుడు ఆయన చెంత ప్రమాణం చేయిస్తే నిజాలు బహిర్గతమవుతాయన్నది ప్రజల విశ్వాసం. పడమటి వీరన్నను పూజించినా, తలచుకున్నా పశువులకు సోకే జబ్బులు నయమవుతాయని రైతుల విశ్వాసం.

గతంలో పురుషులు మాత్రమే వెళ్లేవారు...

మహిమాన్వితుడిగా ఖ్యాతిగాంచిన పడమటి వీరన్న ఆలయానికి గతంలో కేవలం పురుషులు మాత్రమే వెళ్లేవారు. అక్కడి ప్రసాదాన్ని సైతం మహిళలు తాకేవారు కాదు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుత రోజుల్లో మహిళలను సైతం ఆలయంలో స్వామి దర్శనానికి అనుమతిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పడమటి వీరన్న ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు.

ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు..

ఉగాది పండుగ ముందు రోజే పడమటి వీరన్నకు బత్తలపల్లి, తాడిమర్రి మండలాల నుంచే కాక ముదిగుబ్బ, ధర్మవరం, అనంతపురం, నార్పల, యల్లనూరు, పుట్లూరు తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పన్నారపు బండ్లు, పశువులు, ట్రాక్టర్లను అందంగా అలంకరించుకుని వచ్చారు. మరికొందరు వ్యక్తిగత వాహనాలలో చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, ఇంటి నుంచి తీసుకువచ్చిన పిడికెడు బియ్యం, బేడలు, బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇలా పిడికెడు చొప్పున సమర్పించినవే బస్తాలుగా పోగయ్యాయి. వీటిని ఉగాది పండుగ తర్వాత వండి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అన్నదానం నిర్వహిస్తారు.

ఓటులో రకాలు

మీకు తెలుసా?

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల సందడి మొదలైంది. ఓటు హక్కు వినియోగించుకునే వారి సంఖ్యను పెంచేలా కేంద్ర ఎన్నికల సంఘం అన్ని రకాల చర్యలూ చేపట్టింది. ఈవీఎంల ద్వారా అందరూ ఓటు హక్కు వినియోగించుకోవడం పరిపాటి. అయితే ఈ పద్ధతిలో కాకుండా మరిన్ని పద్ధతుల్లోనూ ఓటు వేసే వారు ఉన్నారు. అవేమిటో తెలుసుకుందాం రండి...

టెండర్ ఓటు..

కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఓటరు ఓటు వేయకపోయినా వేసినట్లుగా నమోదై ఉంటుంది. అ సమయంలో సదరు ఓటరు తాను ఓటు వేసి తీరుతానని పట్టుబడుతాడు. దీంతో ఆ ఓటరు వివరాలను ప్రిసైడింగ్ అధికారి పరిశీలించి.. వాస్తవంగా ఓటు ఆయన వేయలేదని నిర్ధారణకు వస్తే ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపరుపై ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తారు. దీనినే టెండర్ ఓటు అంటారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే, ఎంపీలకు సంబంధించి 20 చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. ఓటు వేశాక బ్యాలెట్ పేపర్‌ను కవర్లలో పెట్టి ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తే దాని వెనుక టెండర్ బ్యాలెట్ అని రాస్తారు.

ప్రాక్సీ ఓటు..

కేంద్ర నిఘా సంస్థలు, గూఢచారి సంస్థల సిబ్బంది తమ ఉనికి మరెవరికీ తెలియకుండా గోప్యంగా ఉంటారు. వారు తమ ప్రతినిధిగా మరెవరినైనా పంపి ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు ఉంది. ఈ విధమైన ఓటు హక్కునే ప్రాక్సీ ఓటు అంటారు. వారు స్థానికంగా లేనందున ఓటు వేసేందుకు ఒక ప్రతినిధిని అధికారులు అనుమతిస్తారు. వీరిని క్లాసిఫైడ్ సర్వీస్ ఓటరుగా పరిగణిస్తారు. నియోజకవర్గం, పోలింగ్ బూత్ పరిధిలోని ప్రాక్సీ ఓటరు వివరాలపై ఆర్ఓ ద్వారా ప్రొసీడింగ్ అధికారికి ముందే సమాచారం అందుతుంది. సర్వీసు ఓటరు తరఫున వచ్చే సదరు ఓటరు ఆ పోలింగ్ కేంద్రంలో సాధారణ ఓటరుగానే ఓటు వేస్తారు. ఇలాంటి ఓటరుకు మధ్య వేలికి సిరా చుక్క పెడతారు. అదే సర్వీసు ఓటరుకు అయితే కుడి చేతికి సిరా చుక్క పెడతారు. అయితే ప్రాక్సీ ఓటరు ఒకరి తరపున మాత్రమే ఓటు వేసేందుకు అవకాశం ఉంది.

సర్వీస్ ఓటు..

దేశ రక్షణలో భాగంగా చాలా మంది సైనికులు, పారామిలటరీ ఉద్యోగులు స్వరాష్ట్రానికి వెళ్లి తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కును వినియోగించుకోలేరు. తమకు నచ్చిన నాయకుడికి ఓటు వేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం వీరికి వెసులుబాటు కల్పించింది. వీరిని సర్వీస్ ఓటర్లుగా గుర్తిస్తారు. ఆసక్తి ఉన్న వారు కోరుకుంటే వీరి కోసం ప్రత్యేకంగా సర్వీసు ఓటును కల్పిస్తుంది. వీరు సర్వీస్‌లో ఉన్న ప్రాంతం నుంచే ఓటు వేయవచ్చు.

సాధారణ ఓటు..

భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించింది. ఇలా ఓటు హక్కు పొందిన వారు తమకు నచ్చిన నేతకు ఓటు వేయవచ్చు. తమ గ్రామాల్లో బూత్‌కు వెళ్లి మామూలుగా ఓటు వస్తే దానిని సాధారణ ఓటు అంటారు.

అక్రమ మద్యం తరలింపును అరికట్టండి

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అక్రమంగా మద్యం చొరబడకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ ఆర్.నాగమద్దయ్య ఆదేశించారు. స్థానిక సెబ్ స్టేషన్‌ను సోమవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సరిహద్దుల్లో చెక్‌పోస్టులను మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుబ్రహ్మణ్యం, పెనుకొండ సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేశారు



ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

పుట్టపర్తి టౌన్: ఉద్యోగాల పేరుతో బుద్ధా హెల్త్ ఫౌండేషన్ మోసం చేసిందని ఎస్పీ మాధవరెడ్డికి ఏఐవైఎఫ్ (అఖిల భారత యువజన సమాఖ్య) నాయకులు, యోగా టీచర్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్పీని ఆయన చాంబర్‌లో వారు కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ... నిరుద్యోగుల బలహీనతలను ఆసరాగా చేసుకున్న బుద్ధా హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ సయ్యద్ వలి ఒక్కొక్కరి నుంచి రూ. 3 లక్షల నుంచి రూ.5లక్షల వరకూ డబ్బు వసూలు చేసుకుని ప్రభుత్వ పాఠశాలలో యోగా టీచర్లగా నియమించాడని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1,400 మంది సయ్యద్ వలి మాటలు నమ్మి డబ్బు కట్టారన్నారు. 14 నెలలుగా పనిచేయించుకుంటూ కనీస జీతాలు కూడా ఇవ్వకుండా మోసం చేశాడన్నారు. ఫౌండేషన్ చైర్మన్ సయ్యద్ వలిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విన్నవించారు. స్పందించిన ఎస్పీ విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసానిచ్చారు. ఎస్పీని కలిసిన వారిలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప, యోగా టీచర్లు సతీష్, శివకుమార్, లలిత, హరినాయక్ తదితరులు ఉన్నారు.

బడి వేళలు మార్చండి

ఎన్పీకుంట: జిల్లాలో రోజురోజుకూ అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఒంటి పూట బడుల నిర్వహణ వేళలు మార్చాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కంటే శ్రీసత్యసాయి జిల్లాలో రెండు మూడు డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదవుతోందన్నారు. వడగాలులు వీచే అవకాశముందంటూ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు వడదెబ్బ బారిన పడకుండా ఉండేదుకు పాఠశాలలను ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు నిర్వహించేలా పరిశీలించాలని కోరారు. అలాగే వార్షిక పరీక్షల పని వేళలను ఉదయం 8 నుండి 11 గంటల వరకు నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పర్యవేక్షించండి

హిందూపురం టౌన్: పోలింగ్ కేంద్రాలను సందర్శించి అందులో సౌకర్యాలను పర్యవేక్షించాలని సెక్టోరియల్ అధికారులను జేసీ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎన్నికల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విధుల్లో అలసత్వం వీడాలని హెచ్చరించారు. పట్టణంలోని ముదిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అరవింద్ నగర్‌లోని మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలోని 25 నుంచి 29వ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఎన్నికల నాటికి పోలింగ్ కేంద్రాల్లో తప్పనిసరిగా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాదరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, లేపాక్షి తహసీల్దార్ బాలనరసింహులు, చిలమత్తూరు తహసీల్దార్ భాగ్యలత, ఆర్ఐ అమరేంద్ర, ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కొడికొండ చెక్‌పోస్టులో తనిఖీలు

చిలమత్తూరు: మండలంలోని 44 జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన కొడికొండ చెక్‌పోస్టులోని పోలీస్ చెక్ పాయింట్‌ను సోమవారం జేసీ అభిషేక్‌కుమార్ తనిఖీ చేశారు. సిబ్బందికి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. గత గురువారం సుడిగాలికి పోలీసు గుడారం ఎగిరిపోయిన నేపథ్యంలో ఆయన పర్యటించి సిబ్బంది సాదకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ భాగ్యలతకు సూచించారు.

టీడీపీ ప్రచారంలో రేషన్ డీలర్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డీలర్ రామకృష్ణారెడ్డి (వృత్తంలోని వ్యక్తి)

తలుపుల: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ టీడీపీ అభ్యర్థి తరఫున ప్రచారంలో ఓ రేషన్ డీలర్ పాల్గొనడం చర్చనీయాంశమైంది. తలుపుల మండలం నూతన కాల్వ గ్రామంలో సోమవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గెరికపల్లి రేషన్‌షాపు(21) డీలర్ బి.రామకృష్ణారెడ్డి పాల్గొని, టీడీపీకి ఓటు వేయాలంటూ అభ్యర్థించారు.

కందికుంట అనుచరుడిపై కేసు నమోదు

కదిరి టౌన్: కందికుంట వెంకటప్రసాద్ అనుచరుడు బేల్దారి శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పుల్లయ్య తెలిపారు. పట్టణంలోని శివాలయం వీధికి చెందిన శేషగిరి అదే వీధికి చెందిన బేల్దారి శ్రీనివాసులుపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. గతంలో వినాయకచవితి పండుగకు చందా ఇవ్వలేదని అక్కసు పెంచుకున్న శ్రీనివాసులు... మార్చి 30న కదిరిలో రథోత్సవం సాగుతుండగా మరొకరిపై దాడి చేస్తున్న అంశాన్ని తేరుపై నుంచి శేషగిరి తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. ఈ విషయాన్ని గమనించిన శ్రీనివాసులు ఆ మరుసటి రోజు శేషగిరిపై దాడి చేసి, చంపుతానని బెదిరించాడు. శ్రీనివాసులు నుంచి తనకు ప్రాణహాని ఉన్నట్లుగా బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఖాద్రీశుడి సన్నిధిలో సమాచార హక్కు చట్టం కమిషనర్



శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సోమవారం కుటుంబసభ్యులతో కలసి సమాచార హక్కు చట్టం కమిషనర్ చెన్నారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

రేగాటిపల్లిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ధర్మవరం రూరల్: మండలంలోని రేగాటిపల్లిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సెల్వియా సల్మాన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఎల్ఏటీఓ తిప్పయ్య, మెడికల్ ఆఫీసర్ పుష్పలత, చిన్న పిల్లల వైద్య నిపుణులు వెంకటేశ్వర్లు, ఈఎన్‌టీ స్పెషలిస్టు నివేదిత, ఆప్తలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప, సూపర్‌వైజర్లు రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సోమఘట్ట వాసి అనుమానాస్పద మృతి

చిలమత్తూరు: మండలంలోని సోమఘట్టకు చెందిన నరసింహులు (40) తెలంగాణాలోని గద్వాల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ గంగాధర్ తెలిపిన మేరకు... సోమఘట్టకు చెందిన టీడీపీ నాయకుడు తిప్పారెడ్డికి గద్వాల్‌లో కోళ్ల ఫారం ఉంది. అక్కడ పనిచేసేందుకు నలుగురు కూలీలను ఇక్కడి నుంచి పిలుచుకెళ్లారు. వారిలో ఒకరైన నరసింహులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నరసింహులు మృతదేహాన్ని సోమవారం స్వస్థలానికి తీసుకువచ్చారు. ఉద్దేశపూర్వకంగానే నరసింహులును హతమార్చినట్లుగా బంధువులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. కాగా, ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు సదరు టీడీపీ నేత ప్రయత్నాలు చేస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

నల్లచెరువు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం బాటిళ్లను సోమవారం స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ లింగన్న తెలిపారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో సిబ్బందితో కలసి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఎన్పీకుంట మండలం ఎదురుదోనకు చెందిన ఈశ్వరయ్య స్కార్పియో వాహనాన్ని ఆపి పరిశీలించడంతో 90 ఎంఎల్ సామర్థ్యమున్న 80 బాటిళ్లతో పాటు మరో మూడు మూడు ఫుల్ బాటిళ్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. నిందితుడు ఈశ్వరయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లుఎస్ఐ తెలిపారు.